క్లుప్తంగా

శ్యామలాంబకు సంధ్యారాణి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి

సాలూరు: సాలూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన నేపథ్యంలో గుమ్మడి సంధ్యారాణి బుధవారం సాలూరు పట్టణంలోని శ్యామలాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత తొలిసారిగా ఆలయానికి వచ్చిన ఆమెకు స్థానిక నాయకులు, అభిమానులు అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మక్కువ: మండలంలోని ములక్కాయ వలస మోడల్ పాఠశాలలో 7,8,9 తరగతులకు సంబంధించి మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ లోపు విద్యార్థులు నేరుగా దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని, ఈనెల 10న పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాఠశాలకు వచ్చి దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస కూడలి వద్ద ఉన్న సత్యసాయి అన్నదాన సత్రంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తామని సత్యసాయి సేవాసమితి సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులతో శిబిరం నిర్వహిస్తామని చెప్పారు. కంటి రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



భక్తుల పూజలు అందుకుంటున్న మరిడమ్మ

పాలకొండ రూరల్: మండలంలోని వీపీ రాజుపేట గ్రామ సమీపంలో భక్తులు నిర్మించిన మరిడమ్మతల్లి గ్రామదేవత ఆలయంలో ప్రథమ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. పండితుల వేద మంత్రోచ్చరణ మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమం చేపట్టారు. పెద్ద ఎత్తున దంపతులు, భక్తులు అమ్మవారికి అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో పట్టణ, మండల పరిధిలో ప్రజలు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు భక్తిశ్రద్ధలతో స్వీకంచారు.

పక్కాగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ



అంగన్వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నూకాలమ్మ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూకాలమ్మ అన్నారు అంబఖండిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అందిస్తున్న వైఎస్సార్ పోషణ, బాలామృతం వస్తు సామాగ్రిపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



ఎం.హర్షవర్ధన్



ఎల్.లోకేశ్వరి

వంగర: మండల పరిధిలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.హర్షవర్ధన్, లచ్చుభుక్త లోకేశ్వరి ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్ఎం ఖండాపు జగదీశ్వరి, ఉపాధ్యాయులు బుధవారం ప్రత్యేకంగా పాఠశాల ఆవరణలో అభినందించారు.

పర్యావరణం బాధ్యత అందరిదీ

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సౌందర్య నారాయణ మూర్తి నగర్ పార్క్‌లో కాలనీ పెద్దలతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనమందరం కలిసి మన పరిసరాలను, పర్యావరణాన్ని ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడిపేందుకు, రాబోయే తరాల కోసం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తీసుకుందామని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన గాలి, నీరు, మూగ జీవుల మనుగడ కోసం మనం తప్పకుండా పర్యావరణాన్ని రక్షించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంవల్ల శుభ్రమైన గాలిని ప్రాణులకు నివాసాలను అందిస్తాయన్నారు. పట్టణ వ్యాపారస్తులకు బడ్డీ షాపులు నిర్వాహణదారులంతా ప్రతి ఒక్కరూ సింగిల్ యూస్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం వాడాలని చెప్పారు. మెయిన్ రోడ్డులో షాపులు ఉన్న వ్యాపారస్తులు తమ షాప్ ముందు డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకుని వినియోగదారులు డస్ట్‌బిన్‌లో చెత్తను వేసే విధంగా చూసుకోవాలని, వాటిని సేకరించేందుకు మున్సిపల్ కమర్షియల్ వెహికల్ అందుబాటులో ఉందని గుర్తుచేశారు. వ్యాపారస్తులు తప్పకుండా డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని లేకుంటే ఫైన్ వేయనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కిరణ్, సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు ఎస్ఎన్ఎమ్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

రవాణా శాఖ ఆవరణలో పర్యావరణ దినోత్సవం

జిల్లా రవాణా శాఖ ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐఆర్‌పీడబ్ల్యూఏ సంస్థ, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా రవాణాశాఖ అధికారి సి.మల్లికార్జున్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బుధవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరామమూర్తి, జట్టు ట్రస్టుకు పద్మజ, ఎస్.రమేష్ కుమార్ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఎ.వరప్రసాద్. జి.సీతారాం, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పుణ్యవతి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కాశీరాం నాయక్, సీతం కాలేజ్ బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి సి.మల్లికార్జున్ రెడ్డి



నిర్వహిస్తున్న ప్రపంచపర్యావరణ దినోత్సవం కార్యక్రమం

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

సాలూరు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.శివకుమార్ అన్నారు. ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన పట్టణంలో గ్రీన్‌వరల్డ్ సంస్థ ఆధ్వర్యంలో జ్యోతి హాస్పిటల్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొక్కలు పెంచడం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్ వరల్డ్ వ్యవస్థాపకుడు సంతోషకుమార్ శర్మ పాణిగ్రహి, సభ్యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

మక్కువ: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని మక్కువ ఫారెస్ట్ అధికారి నారాయణరావు అన్నారు. ముక్కువ మండలంలోని ఒడిసిల మెట్ట ఏఎన్ఆర్ 10 హెచ్ ప్లాంటేషన్లో 500 మొక్కలు, బాగుజోల హెచ్ఏఎన్ఆర్ ప్లాంటేషన్‌లో 2వేల మొక్కలను బుధవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యం ఏర్పడడంతో, ప్రతి ఒక్కరు మొక్కలను పెంచే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రమణ, సతీష్, గణపతి, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న మక్కువ ఫారెస్ట్ అధికారి నారాయణరావు

విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు

పాలకొండ రూరల్: స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలకు అందించిన శిక్షణ మేరకు పోటీలు ఉల్లాసంగా సాగాయి. చిన్నారులు సినీ, జానపద గీతాలకు నృత్యంతో అలరించారు. విజేతలైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన గ్రంథపాలకుడు బి.గణేష్‌బాబు, ఉపాధ్యాయుడు జి.మురళి తెలిపారు. అనంతరం ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై తర్ఫీదు ఇచ్చారు.



డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పోల్‌మేనేజ్ మెంట్‌లో వెనుకబడ్డాం

భామిని: వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందినా ఓట్ల రూపంలో ఆదరించకపోవడం విచారకరమని మండల నాయకులు వాపోయారు. ఎన్నికల ఫలితాలపై భామిని మండలం కాట్రగడ–బిలో ఎంపీపీ తోట శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తోట సింహాచలం కార్యకర్తలతో బుధవారం సమీక్షించారు. డీబీటీ విధానంలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాకు, వలంటీర్లతో ప్రతీ ఇంటికి చేరాయని, వాటి కేటాయింపులో కార్యకర్తలకు ప్రమేయం లేక పోవడంతో పోల్ మేనేజ్‌మెంట్‌లో వెనుకబడినట్టు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోదెపు శ్రీనివాసరావు, అర్లి రాజశేఖర్, కొత్తూరు ప్రసాద్, సాసుపిల్లి సంజీవరావు, కార్యకర్తలు ఉన్నారు.



కార్యకర్తలతో చర్చిస్తున్న ఎంపీపీ శాంతికుమారి, పార్టీ అధ్యక్షుడు సింహాచలం

యంత్ర వినియోగం లాభదాయకం



చిన్నకోడిశలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా వరి ఎదలు వేస్తున్న సిబ్బంది

రేగిడి: సాగులో యంత్రాలను వినియోగించడం లాభదాయకమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ బి.లక్ష్మీనరసింహమూర్తి అన్నారు. మండల పరిధిలోని చిన్నకోడిశ గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లి నారాయణరావుకు చెందిన రైతు పొలంలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ యంత్రం ద్వారా పొడి వరి ఎదసాగుపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఉపయోగించి, యాంత్రాలతో సాగు చేపట్టడం వల్ల తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని చెప్పారు. అవసరమైన రైతులు 99855 42147 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త శరత్‌బాబు, ఉమామహేశ్వరరావు, కొండవలస, ఉణుకూరు, ఒప్పంగి, తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల్లో ఆర్‌అండ్‌బీ బంగ్లా



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వీరఘట్టంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం. ఒకప్పుడు చుట్టూ పచ్చని చెట్ల మధ్యలో సకల సౌకర్యాలతో నిత్యం అతిథులతో కళకళలాడే ఆర్‌అండ్‌బీ బంగ్లా అతిథి గృహం ఇప్పుడు బూత్ బంగ్లాను తలపిస్తోంది. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో ఉన్న రూ.లక్షలు విలువ చేసే సామగ్రి తుప్పుపట్టి పాడైపోయింది. పచ్చదనం క్రమేపి అంతరించిపోతోంది. ప్రస్తుతం ఇక్కడి పరిస్థితి చూస్తే అత్యంత దయనీయంగా కనిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో అతిథిగృహ పరిసరాలు సైతం ఆక్రమణలకు గురవుతున్నాయి.

వీరఘట్టం

మండల కేంద్రంలో రెండు విశాలమైన గదులతో కూడిన ఆర్‌అండ్‌బీ బంగ్లా అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారింది. ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఒకప్పుడు ఇక్కడి అతిథి గృహంలో రెండు పరుపులు, భోజన టేబుళ్లు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, పది కుర్చీలు, రెండు టేబుళ్లు, ఇతర సామగ్రి ఉండేది. ఇక్కడ ఒక్క కాపాలదారుడు విధులు నిర్వహించేవాడు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు మండల పర్యటనకు వచ్చిన సమయంలో ఈ బంగ్లాలో భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొనేవారు. ఈ ఆవరణలో సమావేశాలు కూడా నిర్వహించేవారు. వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో దీనిని అద్దెకు ఇవ్వడంతో ప్రభుత్వానికి కొంత ఆదాయం వచ్చేది.

ఇదీ పరిస్థితి....

సుమారు 12 ఏళ్ల కిందట రూ.35 వేలు విద్యుత్ బకాయి ఉండేది. ఈ మొత్తాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు చెల్లించకపోవడంతో అప్పటిలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఫలితంగా ఇది నిరుపయోగంగా ఉండడంతో ఇందులో ఉన్న ఫర్నిచర్, ఇతర సామగ్రి పూర్తిగా పాడైపోయింది. భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ భవనం విషసర్పాలకు నిలయంగా మారింది. ఇక్కడ ఉన్న ఆర్‌అండ్‌బీ బంగ్లా కార్యాలయ భవనం కూడా ఇదే పరిస్థితికి చేరుకుంది.



పశువులకు నిలయంగా మారిన మరో భవనం

ఆక్రమణల జోరు....

ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ పరిసర ప్రాంతాన్ని సమీప నివాస గృహాల వారు ఆక్రమణ చేస్తున్నారు. కొంచెంకొంచెంగా కట్టడాలు చేపడుతూ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారు. ఇలానే వదిలేస్తే ఆర్‌అండ్‌బీ బంగ్లా స్థలం పూర్తిగా కబ్జాకు గురికావడం ఖాయమని స్థానికులు వాపోతున్నారు.

మామిడితోటతో ఆదాయం

ఈ బంగ్లా వద్ద మామిడి తోటతో పాటు పాసి, మద్ది వంటి చెట్లు ఉండేవి. ఏటా మామిడితోటను రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకు లీజుకు ఇవ్వడంతో ప్రభుత్వానికి కొంత ఆదాయం వచ్చేది. దీంతో పాటు చెట్లు సంరక్షణ కూడా బాగుండేది. పన్నెండేళ్లుగా అధికారులు దీనిని కూడా పట్టించుకోవడం మానేశారు. అప్పటి నుంచి ఈ ఫలసాయాన్ని ఎవరికి అందితే వారు అనుభవిస్తున్నారు. కొంతమంది చెట్లను నరికి కలపగా మార్చి తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఈ పరిస్థితి కొనసాగుతుండడంతో ఇప్పటికే కొన్ని చెట్లు పూర్తిగా అంతరించిపోయాయి. మిగిలిన చెట్లు గొడ్డలి వేటుకు బలైపోయావి. పచ్చదనం కాస్తా కనుమరుగవుతోంది. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టిసారించి బంగ్లాకు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు చెట్లను సంరక్షిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ



చందలంగిలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు

- డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహనరావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని చందలంగి, బట్టివలస గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు బుధవారం పరిశీలించారు. ప్రతి ఇంటికి స్ప్రేయింగ్ సక్రమంగా చేపడుతున్నదీ, లేనిదీ స్వయంగా తనిఖీ చేశారు. దోమల మందు ఏసీఎం రసాయనం వినియోగించిన మోతాదు, గ్రామంలో ఇళ్ల సంఖ్య తదితర వివరాలపై ఆరా తీశారు. మార్కింగ్ వేసిన ఇళ్లకు స్ప్రేయింగ్ జరిగిన తీరును గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 15 నుంచి మొదటి విడత స్ప్రేయింగ్ దోమల నివారణ చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా జరుగుతోందని, పార్వతీపురం మండలంలో 36 గ్రామాలకు గాను ఇప్పటికి 26 గ్రామాలలో స్ప్రేయింగ్ పూర్తయిందని తెలిపారు. వాటితో పాటు డ్రైడే కార్యక్రమాలు, ఫీవర్ సర్వే, యాంటీ లార్వా ఆపరేషన్, శానిటేషన్ డ్రైవ్ మొదలగు దోమల నివా రణ చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి.ధరణి, కార్యాలయ డెమో యోగీశ్వర రెడ్డి, ఈఓ వెంకటనాయుడు, సత్తిబాబు, సూపర్‌వైజర్స్ శంకర్రావు, జయలక్ష్మి, ఎంటీఎస్ రామకృష్ణ, వైద్యసిబ్బంది బంగారి నాయుడు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో వరినాట్లు

- 17,500 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు

సీతానగరం: ఖరీఫ్ సీజన్‌లో తక్కువ ఖర్చు, ఎక్కువ విస్తీర్ణంలో తక్కువ విత్తనాలతో యంత్రాల ద్వారా వరిసాగు చేయడానికి రైతులు ముందుగా అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో కొంతకాలంగా ఖరీఫ్ సీజన్‌లో యాంత్రీకరణ విధానం ద్వారా వరినాట్లు వేయడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఇప్పటికే ఎంఏఓ ఎస్.అవినాష్ సూచనల మేరకు కామందొరవలసలో కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎల్.ఎస్ సుబ్రహ్మణ్యం పొలంలో చేపట్టిన ఆధునిక వ్యవసాయ విధానంలో భాగంగా యంత్రాలతో వరినాట్లు ఏటా వేస్తున్నారు. ఆధునిక వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించుకోలేని రైతులు ఖరీఫ్ వరిసాగు చేయాల్సిన భూమిల్లో కొద్దిపాటి విస్తీర్ణాన్ని భూమి గుల్లబారే విధంగా చదునుచేసి భూమిలో నారు వేయడానికి అదును చూసి నారు పోస్తారు. నారుపోసిన 25రోజుల నుంచి 30 రోజుల వయస్సు కలిగి ఉన్న నారును తీసీ దమ్ము చేసిన మళ్లలో నాట్లు వేస్తారు. నారు వేయడానికి, మట్టి నమూనాలు చేయడానికి, నారుపొయ్యడానికి, కలుపు తియ్యడానికి ఆర్థిక ఇబ్బందులు, కూలీల బెడద ఎక్కువగా ఉంటుంది. దీంతో విసుగు చెందిన రైతులు యాంత్రీకరణ విధానం, తాడుఉడుపు, డ్రమ్ సీడర్ విధానాలతో సాగు చేయడానికి ఇపుడిప్పుడే ఆశక్తి చూపుతున్నారు.



కామందొరవలసలో ట్రేలలో తయారైన వరినారు మళ్లలో యంత్రంతో నాట్లు వేయిస్తున్న రైతు

యాంత్రీకరణపై అవగాహన కల్పించుకోవాలి



ఖరీఫ్ సీజన్ రావడంతో మండలంలోని 17,500 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. యాంత్రీకరణ విధంలో బహుళ ప్రయోజనాలు పొందడానికి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఖరీఫ్ సీజన్‌లో డ్రమ్‌సీడర్ విధానం, ట్రేలలో నారు వేయించడం, తాడు ఉడుపు, దమ్ముచేసిన మళ్లలో మొక్క వేయడం తదితర విధానాలతో వరిసాగుపై రైతులకు వివరిస్తున్నాం.

ఎస్.అవినాష్, ఎంఏఓ, సీతానగరం

నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే చర్యలు

- ఏఓ వెంకటయ్య

రామభద్రపురం: నిషేధిత పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే దుకాణాల అనుమతులు రద్దు చేస్తామని ఏఓ వెంకటయ్య అన్నారు. బుధవారం స్థానిక ఏఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా బయో కంపెనీలకు చెందిన పురుగు మందులు విక్రయించకూడదన్నారు. లైసెన్స్ లేని వ్యక్తులు, దుకాణాలు, దళారులు, ఇతరత్రా వ్యాపారుల వద్ద కొనుగోలు చేయకూడదని సూచించారు. సరుకు లాట్ నంబర్, తయారీ తేదీ, రకం ఇలా అన్ని వివరాలు ఉంటేనే కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారి సంతకం చేసిన బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయశాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్ఏలు కొండలరావు, హేమ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ వెంకటయ్య

ప్రత్యేక అవసరాల విద్యార్థుల గుర్తింపు

రాజాం: గ్రామాల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల గుర్తింపు కార్యక్రమం జరుగుతోందని ఎంఈఓ యాగాటి దుర్గారావు అన్నారు. మండలంలోని కొండంపేట, పొగిరి, నందబలగ, కంచరాం, తదితర గ్రామాల్లో బుధవారం దివ్యాంగ విద్యార్థులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాల్లోపు గల దివ్యాంగులకు భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ మోడిఫికేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టి, వారి నడవడికలో మార్పులు తీసుకువస్తామన్నారు. ఈ నెల 9 వరకు గుర్తింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈడీ ఉపాధ్యాయులు ఎస్.హరిబాబు, వి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



కొండంపేటలో దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంఈఓ దుర్గారావు, తదితరులు

విత్తనాలకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వంగర: ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ తట్టికోట కన్నబాబు తెలిపారు. మండల పరిధిలోని కొప్పర, కొప్పరవలసలో విత్తన ఎంపిక, పచ్చిరొట్ట విత్తనాలు సాగు వంటి అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరమైన విత్తనాలు ఆర్‌బీకేల్లో ఉన్నాయని, అగ్రికల్చర్ అసిస్టెంట్ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కిమిడి సన్యాసినాయుడు, రైతులు పాల్గొన్నారు.